క్లుప్తంగా

కేఎంసీ క్యాంటీన్ సమస్యను పరిష్కరించాలి



కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మకు వినతిపత్రం ఇస్తున్న సాయి ప్రదీప్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలోని క్యాంటీన్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పీటీ సాయిప్రదీప్ కోరారు. ఈ మేరకు బుధవారం కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళాశాలకు దేశ, విదేశాల్లో మంచి పేరుందని, ఇలాంటి కళాశాలలో క్యాంటీన్ లాంటి చిన్న వివాదం పెద్దది కాకూడదన్నారు. ఈ సమస్యను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని కోరారు.

ఆస్పత్రి అభివృద్ధికి నిధులు కేటాయించాలి



సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని పాతబస్తీలో ఉన్న గడియారం ఆసుపత్రికి నిధులు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. బుధవారం గడియారం ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన గడియారం ఆసుపత్రి అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలన్నారు. ఇక్కడ బెడ్లను అభివృద్ధి చేసి కాన్పులకు ప్రాధాన్యత ఇచ్చి ప్రసవాలు చేస్తే ఎంతో మేలన్నారు. అలాగే ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, ఇరత పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌బాషా, షాషావలి, రసూల్‌అహ్మద్, ఖాదర్‌బాషా, నూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలి



చనుగొండ్లలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ భాస్కర్

కోడుమూరు రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని డీపీఓ భాస్కర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గూడూరు మండలంలోని చనుగొండ్లలో డీపీఓ భాస్కర్ బుధవారం పర్యటించారు. గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. డీపీఓ మాట్లాడుతూ గ్రామంలో డెంగ్యూ కేసు నమోదైన దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా గ్రామస్తులు జ్వరంతో బాధపడుతుంటే వారు సంబంధిత ఆరోగ్య సిబ్బందితో రక్తపరీక్షలు చేయించుకుని తగు చికిత్స పొందాలని సూచించారు. అనంతరం డీపీఓ గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి చెత్త నుంచి సంపదను సృష్టించాలని ఈఓఆర్డీ మధులత, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌కు సూచించారు.


సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : హిట్ : ది థర్డ్ కేస్, శుభం , సింగిల్ ,ఫైనల్ డెస్టినేషన్ : బ్లడ్ లైన్స్ శించాన్ : అవర్ డైనోసర్ డైరీ
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : హిట్ : ది థర్డ్ కేస్, శుభం, దేశముదురు (2020), ఫైనల్ డెస్టినేషన్ : బ్లడ్ లైన్స్, రెట్రో, బ్లైండ్ స్పాట్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : హిట్ : ది థర్డ్ కేస్, సింగిల్, రెట్రో
శ్రీరామ : దేశముదురు (2020)
రాజ్ : సింగిల్
భరత్ కాంప్లెక్స్ : కామన్ మ్యాన్ పెల్లాం

కంగారూ నేర్పే తల్లి పాఠం

- అమ్మ పొత్తిళ్లే బిడ్డకు ఆరోగ్యం
- ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవు
- తల్లికి సమృద్ధిగా పాలు
- ఇన్‌ఫెక్షన్లకు దూరంగా శిశువు
- నేడు కంగారూ సంరక్షణ అవగాహన దినం



కంగారూ మదర్ కేర్ చిత్రం

కర్నూలు(హాస్పిటల్): నవమాసాలు మోసిన అనంతరం ప్రసవించిన బిడ్డను చూస్తే ఆ తల్లికి కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. అప్పటివరకు అమ్మ కడుపే ప్రపంచంగా ఎదిగిన శిశువు ఒక్కసారిగా బయటి ప్రపంచంలోకి రాగానే అయోమయంలో ఏడుస్తాడు. ఇలాంటి పరిస్థితుల్లో అమ్మ పొత్తిళ్లు ఆ శిశువుకు కొండంత ధైర్యాన్ని ఇస్తాయి. అంతేకాదు తల్లి స్పర్శతో శారీరక, మానసిక ఆరోగ్యం కూడా కలుగుతుంది. ఇదే సమయంలో తల్లికి బిడ్డకు అవసరమైన పాల ఉత్పత్తి జరుగుతుంది. తల్లిపాలను తాగిన బిడ్డకు రక్షణ కలుగుతుంది. నవజాత శిశువుల సంరక్షణకు గాను ఈ నెల 15వ తేదీన కంగారూ సంరక్షణ అవగాహన దినం నిర్వహిస్తున్నారు.

జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఆదోని ఏరియా ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రి, ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కొత్తగా మరో 12 పీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటితో పాటు 60కి పైగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ప్రతి సంవత్సరం 38 వేల మందికి పైగా గర్భిణులుగా నమోదు చేసుకుంటున్నారు. బిడ్డ జన్మించగానే వారికి ఏదైనా అనారోగ్యం కలిగినా, బిడ్డ తక్కువ బరువుతో జన్మించినా, ఇతర అనారోగ్య సమస్యలేమైనా ఉన్నా వారిని కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ఎస్ఎన్‌సీయూ, ఎన్‌ఐసీయూల్లో ఉంచి చికిత్స అందిస్తున్నా రు. జన్మించిన శిశువులకు అవసరమైన టీకాలను అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచా రు. ఈ మేరకు ప్రతి సంవత్సరం 42 వేల చిన్నారుల కు టీకాలు అందిస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఆయా ఆసుపత్రుల్లో శిశువు సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తల్లులకు వివరిస్తున్నారు. తక్కువ బరువుతో, నెలలు నిండకుండానే జన్మించిన శిశువులందరికీ కంగారూ సంరక్షణ శిక్షణ ఇస్తారు.

కంగారూలా బిడ్డకు రక్షణ

తల్లీబిడ్డల మధ్య శిశువు, సుదీర్ఘ శారీరక స్పర్శ కలిగించడం, తల్లి, తన బిడ్డను గుండెలకు హత్తుకునేలా చూడటం కంగారూ మాతృ సంరక్షణ (కేఎంసీ)లోని కీలకాంశం. అలా అని ఈ విధానంలో కేవలం శిశువుకు శారీరక స్పర్శ ఒక్కటే ఉండదు. కంగారూ పొజిషన్, కంగారూ న్యూట్రిషన్, కంగారూ డిశ్చార్జ్ ఈ మూడూ కలగలిపితేనే కేఎంసీ అవుతుంది.

కంగారూలా చేయాలి

ఈ విధానంలో నవజాత శిశువును ఎలాంటి అచ్ఛాదన లేకుండా తల్లి గుండెలకు హత్తుకుంటుంది. దీనివల్ల తల్లీ బిడ్డలిద్దరి మధ్య గాఢమైన శారీరక స్పర్శ ఏర్పడుతుంది.తల్లీబిడ్డలు ఒకరినొకరు చూసుకునే విధంగా, ఇద్దరూసాధ్యమైనంత వరకు నిలబడేభంగిమలో లేదా కూర్చునే భంగిమలో ఉంటారు. తక్కువ బరువుతో, నెలలు నిండకుండా పుట్టినపిల్లలకు తరచుగా ఈ విధానంలో శారీరక స్పర్శ కలిగిస్తారు. ఇది ఒకరకంగా ప్రేమతో కూడిన ఆలింగనం అని వైద్యులు పేర్కొంటారు.

తల్లిపాలతో శిశువుకు రక్షణ

కంగారూ న్యూట్రిషన్ విధానంలో వీలున్నంత వరకు శిశువుకు తల్లిపాలను మాత్రమే ఇస్తారు. ఇందులో తల్లి నేరుగా బిడ్డకు స్తన్యం ఇవ్వొచ్చు. ఒకవేళ శిశువు పాలు తాగలేకపోతే తల్లిపాలను ఒక కప్పులో లేదా చెంచాలో పట్టి బిడ్డకు పట్టించాలి. సంప్రదాయ పద్ధతి (ఉగ్గు గిన్నె)లో కూడా పాలు పట్టవచ్చు. నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు తల్లిపాలతో పాటు తగినన్ని పోషకాలను అందించాలి.

కంగారూ డిశ్చార్జ్

కంగారూ మాతృ సంరక్షణలో శిశువులు శారీరక బలాన్ని, తగినంత వెచ్చదనాన్ని త్వరగానే సముపార్జించుకుని తల్లిపాలు తాగడం ప్రారంభిస్తారు.

శిశువుకు కలిగే ప్రయోజనాలు

- శిశువు శరీర ఉష్ణోగ్రత మరీ తక్కువ గాకుండా ఉంటుంది
- ఎక్కుసార్లు, చాలా సేపు తల్లి పాలు తాగుతారు. దీనివల్ల బిడ్డ ఎదుగుదల బాగుంటుంది.
- మెదడు ఎదుగుదల బాగుంటుంది. నాడీ వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది.
- అంటువ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.
- శిశువు జ్ఞానేంద్రియాలు సంతృప్తికరంగా పనిచేస్తాయి.

తల్లికి కలిగే ప్రయోజనాలు

- పసిబిడ్డ ఆలనా, పాలనా చూడటంలో తల్లి చురుగ్గా ఉంటుంది.
- ప్రసవానంతరం కలిగే నిర్వేదం, మనో వైకల్యాలు గణనీయంగా తగ్గుతాయి.
- హార్మోనులు బాగా వృద్ధి చెందడం వల్ల బిడ్డకు స్తన్యం బాగా ఇవ్వగలుగుతుంది.
- శిశు సంరక్షణ చక్కగా చేయగలదు.

ఆసుపత్రి నుంచి వచ్చేసిన తర్వాత ఇంట్లోనే బిడ్డకు తగిన ఆరోగ్య సంరక్షణ ఇవ్వగలనన్న నమ్మకం తల్లికి కలుగుతుంది. ఈ క్రమంలో బిడ్డ ఎదుగుదలను పరీక్షించేందుకు, టీకాలను వేయించేందుకు క్రమం తప్పకుండా ఆసుపత్రికి వెళుతూ ఉండాలి. శిశువు నాడీ వ్యవస్థ అభివృద్ధి ఎలా ఉందనేది ఎప్పటికప్పుడు వైద్యులచే పరిశీలింపజేయాలి.

కంగారూ మదర్‌కేర్‌పై అవగాహన



కంగారూ మదర్‌కేర్‌పై జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ మేరకు నర్సులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. తక్కువ బరువుతో జన్మించిన బిడ్డకు, నెలలు నిండకుండా జన్మించిన శిశువుకు ఈ విధానం అవసరం అవుతుంది. అయితే ఇలాంటి శిశువులో ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే మాత్రం వారిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్ఎన్‌సీయూల్లో చికిత్స అందించాల్సి ఉంటుంది.
–డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్ఓ, కర్నూలు

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



క్రీడా దుస్తులు పంపిణీ చేసిన హేమంత్‌కుమార్

కర్నూలు (టౌన్): చిత్తూరు జిల్లాలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో క్రీడాకారులు రాణించాలని బీఎస్ఎన్ఎల్ అధికారి హేమంత్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉన్న బాస్కెట్‌బాల్ రింగ్ వద్ద.. రాష్ట్ర పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నాయకులు దాదాబాషా పాల్గొన్నారు.

కల్నల్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

కర్నూలు(సెంట్రల్): పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దేశ సైనికుల మెరుపుదాడి వివరాలను వెల్లడించిన కల్నల్ సోఫియా ఖురేషిపై మధ్యప్రదేశ్‌కు చెందిన మంత్రి విజయ్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, తక్షణమే ఆయన్ను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేసి అరెస్టు చేయాలని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్‌హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. సోఫియా ఖురేషిపై దారుణ వ్యాఖ్యలు చేసిన మంత్రి మూర్ఖుడు అని, బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి అలా మాట్లాడడం భావ్యం కాదన్నారు. ఆయన్ను తక్షణమే పదవి నుంచి తప్పించాలన్నారు.

హజ్ యాత్ర ముస్లింల జీవిత ఆకాంక్ష



హజ్ యాత్రకు వెళుతున్న ముస్లింలను సన్మానిస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): పవిత్ర హజ్ యాత్ర ప్రతి ముస్లిం సోదరుడి కల అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని అశోక్ నగర్‌కు చెందిన అబ్దుల్లా, జహీర్ అహమ్మద్, ఫారూక్ బాషాలను తన నివాసంలో ఎస్వీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ముస్లిం తమ జీవితకాలంలో ఒక్కసారైన హజ్ యాత్ర చేయాలని కోరుకుంటారన్నారు. ఈ యాత్ర ఆత్మశుద్ధికి ఒక సాధనం అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సలీం తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన కల్పించండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): డెంగీ వ్యాధిపై ప్రజల్లో అవ గాహన పెంచాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం పురస్కరించుకుని ఆమె బుధవారం తన చాంబర్‌లో ప్రోగ్రామ్ ఆఫీసర్లతో కలిసి పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డెంగీ వ్యాధి ఏ విధంగా వస్తుంది, లక్షణాలు, చికిత్స, నివారణ పద్ధతుల గురించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజు, డీఐఓ నాగప్రసాద్, ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ డాక్టర్ శైలేష్‌కుమార్, డీపీఎంఓ ఉమ, డెమో శ్రీనివాసులు శెట్టి, సహాయ మలేరియా అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన వారికి పాలించే అర్హత లేదు



స్మార్ట్ మీటర్లు వద్దంటూ ముద్రించిన స్టిక్కర్లను చూపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించిన కూటమి ప్రభుత్వానికి వారికి పాలన సాగించే అర్హత లేదని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, ఈ.రామాంజనేయులు విమర్శించారు. బుధవారం 32వ వార్డు గంగవతి నగర్, గోవర్ధన నగర్‌లో సీపీఎం నాయకులు ఇంటింటికీ తిరిగి స్మార్టు మీటర్లు వద్దు.. పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను అతికించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు స్మార్ట్ మీటర్లను బి గించబోమని,కరెంట్ చార్జీలను పెంచబోమని చెప్పి మోసం చేశారన్నారు. మోసం చేసే వారికి పాలన చేసే అర్హత ఉండదన్నారు. నాయకులు సురేష్, దావీదు, బీసన్న, శ్రావణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, జే.రాజా తదితరులు ఉన్నారు.

16న నెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 16వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బి.క్యాంపు సిల్వర్ జూబ్లీ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా నెట్‌బాల్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కె.నాగరత్నమయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2009 జనవరి తరువాత జన్మించిన క్రీడాకారులందరూ ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని ప్రకటించారు. సబ్ జూనియర్ బాల బాలికల విభాగంలో నిర్వహిస్తున్న ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈ నెల 18వ తేదీన కర్నూలులోని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు ఇండోర్‌లో నిర్వహించనున్న సబ్ జూనియర్ నెట్‌బాల్ జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వయో ధ్రువీకరణ పత్రంతో నేరుగా హాజరు కావాలని సూచించారు. వివరాలకు 93938 55460 సెల్ నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీగా శ్రీహరి



వై.శ్రీహరి

కర్నూలు సిటీ: కర్నూలు జిల్లా ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక విచారణ న్యాయస్థానం (జిల్లా ఆరవ అదనపు కోర్టు)కు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కర్నూలుకు చెందిన న్యాయవాది వై.శ్రీహరిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి సెలవుల్లో ఉండడంతో ఇన్‌చార్జ్ న్యాయమూర్తి (సీబీఐ)ని మర్యాదపూర్వకంగా కలిసి తన కోర్టు విధులకు హాజరయ్యారు. గత నెల రోజుల నుంచి ఇన్‌చార్జ్ పీపీగా వై.ప్రకాష్ రెడ్డి కొనసాగారు. వై.శ్రీహరి నియమాకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. 2006 నుంచి న్యాయవాదిగా కొనసాగుతున్న శ్రీహరి స్పెషల్ పీపీగా మూడేళ్ల పాటు బాధితుల తరఫున వాదనలు వినిపించనున్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



మాట్లాడుతున్న సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్

కర్నూలు(హాస్పిటల్): డ్రగ్స్ దుర్వినియోగం లేని సమాజాన్ని సాధించేందుకు కృషి చేయాలని సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో సర్వోదయ ఐటీఐ కళాశాలలో డ్రగ్స్ దుర్వినియోగంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఏ డ్రగ్ నైనా వాడకూడని విధంగా వాడితే అబ్యూజ్ కిందకే వస్తుందన్నారు. ఇలా చెయ్యడం ద్వారా తాత్కాలికంగా ఆనందం కలుగుతున్నా, లేదా వాస్తవ పరిస్థితుల నుంచి తప్పించుకోవడానికి ఇలా చేస్తున్నా డ్రగ్ అబ్యూజ్ అనే అంటారన్నారు. దీని వల్ల ఆరోగ్యం పాడవుతుందని, కుటుంబ సభ్యులతో అనుబంధాలు తగ్గిపోతాయని, ఆర్థిక ఇబ్బందులు ఏర్పడతాయని జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని, అసలేమీ నేర్చుకోలేని స్థితికి చేరుకుంటారని, ఆలోచనలు, కంట్రోల్‌లో ఉండవని, చెప్పారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి సోమశివారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల బలహీనతలను అవకాశంగా వాడుకుని డ్రగ్స్ వ్యాపారులు వారిని వాహకులుగా మార్చి డ్రగ్స్ ఊబిలోకి లాగుతున్నారని, ఇలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సెట్కూరు సూపరింటెండెంట్ శ్యాంబాబు, ప్రిన్సిపాల్ జీవరత్నం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఛత్రపతి శంభాజీకి ఘన నివాళి

కర్నూలు (అర్బన్): దేశం కోసం, ధర్మం కోసం ప్రాణాలర్పించిన మహావీరుడు ఛత్రపతి శంబాజీ మహారాజ్ అని బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. బుధవారం ఛత్రపతి శంబాజీ మహారాజ్ జయంతి సందర్భంగా కర్నూలు బిర్లా కాంపౌండ్‌లోని బీసీ ఆర్‌పీఎస్ కార్యాలయంలో శంభాజీ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంబాజీ మహారాజ్ తుది శ్వాస వరకు దేశం కోసం, హిందూ ధర్మం కోసం పోరాడిన వీరుడు అని కొనియాడారు. ఔరంగజేబు లాంటి క్రూరుడి చేతిలో బంధీ అయి, చిత్రహింసలకు గురైనా ధర్మం వీడని మహా పరాక్రమవంతుడు అన్నారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి, వాల్మీకి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, ఆరెకటిక సంఘం అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ మృతి



వి.శశిధర్ (ఫైల్)

కర్నూలు(సెంట్రల్): కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న వి.శశిధర్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఇతనికి భార్య వి.విజయలక్ష్మీ, కుమారుడు హితేష్, కూతుర్లు జ్యోష్ణ, రూపేష్ ఉన్నారు. శశిధర్ మృతి విషయం తెలుసుకున్న కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్లు ప్రవీణ్‌కుమార్, వరప్రసాదు, ఇతర సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఫుట్‌బాల్ లీగ్‌కు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన కర్నూలు క్రీడాకారిణులు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపులోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన క్లస్టర్ యూనివర్సిటీ విద్యార్థినులు భువనేశ్వరి, అనిత తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 15వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిజామాబాద్‌లో నిర్వహించనున్న ఈ పోటీల్లో వీరిరువురు పాల్గొంటున్నట్లు క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు బుధవారం వెల్లడించారు. తెలంగాణ ఫుట్‌బాల్ లీగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా ఫుట్‌బాల్ కార్యదర్శి శ్రీనివాసులు, కోచ్ బ్రహ్మ కుమార్ అభినందించారు.

బంద్‌ను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): మే 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లాలో నిర్వహించే ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. బుధవారం చిన్న పార్కు ఆటో స్టాండ్ వద్ద ఆటో యూనియన్ ఓల్డ్ సిటీ ఆధ్వర్యంలో బంద్‌కు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. వాహనాల చలానాలు చెల్లించలేక ఆటోలు, ట్యాక్సీల డ్రైవర్లు వృత్తికి దూరమవుతున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్, విజయరామాంజనేయులు, పి.మహ్మద్, కుమార్, బడేబాషా పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఐఓ డాక్టర్ నాగప్రసాద్‌బాబు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని బండిమెట్ట యూపీహెచ్‌సీ పరిధిలోని సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని బుధవారం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్ బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు పిల్లలకు, గర్భిణులకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి, ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్, యు విన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.అనంతరం యూపీహెచ్‌సీని తనిఖీ చేసి అక్కడ ఉన్న టీకాల స్టాక్, ఐఎల్ఆర్, కోల్డ్ చైన్ సిస్టమ్, రికార్డులను పరిశీలించారు. టీకాల రిపోర్టును పరిశీలించి వంద శాతం అన్ని రిపోర్టులు మెరుగుపరచాలని సూచించారు. యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ముషాహిద్ చౌదరి, పాల్గొన్నారు.

డీపీఎంఓ తనిఖీ

శ్రీరామనగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని 61వ సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని డీపీఎంఓ డాక్టర్ ఉమ తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతల గురించి మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డ నుంచి 16 సంవత్సరాల వయస్సు వరకు పలు విడతలుగా టీకాలు వేయించాలని సూచించారు. డీపీవో విజయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉషూ విజేతగా కర్నూలు



విజేతలకు మెడల్స్ అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. స్థానిక టీజీవీ లక్ష్మీ కళ్యాణ మండపంలో మూడు రోజులుగా 12వ రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలు జరుగుతున్నాయి. బుధవారం జరిగిన ఫైనల్ పోటీల్లో కర్నూలు జట్టు విజేతగా నిలవగా గుంటూరు జట్టు (ద్వితీయ స్థానం), తూర్పు గోదావరి జట్టు (తృతీయ స్థానం), విశాఖపట్నం (నాలుగవ స్థానం) లో నిలిచాయి. విజేతలకు జ్ఞాపికలు, మెడల్స్‌ను జిల్లా ఉషూ సంఘం అధ్యక్షుడు డాక్టర్ శంకర్ శర్మ అందజేశారు. ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేశ రక్షణకు కంకణబద్ధులు కావాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య

కర్నూలు కల్చరల్: దేశ రక్షణకు ప్రతిఒక్కరూ కంకణ బద్ధులు కావాలని శ్రీశైలం ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కొండయ్య అన్నారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జై జవాన్ కల్చరల్ ఫెస్టివల్‌లో భాగంగా ఐదో రోజు బుధవారం దేశభక్తి సినీ సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. భరతమాత చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా పీడిస్తున్న ఉగ్రవాదాన్ని ఆపరేషన్ సిందూర్ పేరుతో ప్రధాని నరేంద్రమోదీ మట్టికరిపించారని కొనియాడారు. రాయలసీమ వాసి మురళీనాయక్ జవాన్ వీరమరణం బాధాకరమన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. కల్చరల్ ఫెస్ట్‌కు మంచి స్పందన వస్తోందన్నారు. గాయని సుధారాణి, గజల్ గాయకులు హబీబ్, ఇబ్రహీం, చంద్రకంటి మద్దయ్య తదితరులు పాడిన దేశభక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. కరీముల్లా శిష్య బృందం ప్రదర్శించిన దేశ భక్తి నృత్యాలు అలరించాయి. కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు విస్తృత కార్యక్రమాలు



కళాజాత బృందాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం కళాజాత బృందాల ద్వారా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ, క్షయ విభాగాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ చెప్పారు. ఆయన బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జెండా ఊపి కళాజాత బృందాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన హెచ్ఐవీ ప్రభావిత ప్రాంతాల్లో 20 చోట్ల ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కళాజాత బృందాలకు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న సిబ్బంది, ఎన్జీఓలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డీఆర్‌డీఏ, డ్వామా, ఐసీడీఎస్ వంటి శాఖలతో సమన్వయం చేసుకుని కళాజాత కార్యక్రమాలకు ఎక్కువ మంది హాజరయ్యేలా చూడాలన్నారు. డెమో శ్రీనివాసులు శెట్టి, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వెంకటరత్నం, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు సుధారాణి, నాగరాజు, లింక్ వర్కర్ స్కీమ్ డీఆర్‌పీ నాగరాజు, మునీర్, విజయ, మలేరియా విభాగం అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సరదా కల్యాణం.. ఊరంతా సంబరం !



సరదాగా సాగుతున్న తొర్రిమల్లప్ప, కమలమ్మ కల్యాణం

గొల్లలదొడ్డి గ్రామంలో శ్రీ మల్లందొడ్డి స్వాముల వారి ఉత్సవాలు బుధవారం సరదాగా సాగాయి. గ్రామంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు తొర్రిమల్లప్ప, కమలమ్మ వారి కల్యాణ వేడుక గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సంప్రదాయ వేడుకలా గ్రామస్తులు తొర్రిమల్లప్ప, కమలమ్మ దేవతామూర్తులకు బదులుగా గ్రామ పురుషుల మధ్య సాగిన కల్యాణం సరదాగా సాగింది. అనంతరం ఆయా గ్రామాల స్వామి వారి పల్లకీలకు నిర్వాహకులు వీడుకోలు పలకడంతో ఉత్సవాలు ముగిశాయి.
– సి.బెళగల్